# ఆటకోయిలి పోరడు



"అవ్వా! లేచి తలుపేసుకో నేను పోతున్న." తలకు తువ్వాలను గట్టిగా చుట్టుకుంటూ చెప్పాడు చంద్రం.

గాఢనిద్రలో ఉన్నట్టుంది. ఎల్లవ్వ పలుకలేదు. పాత బట్టపేగుతో సైకిల్‌ను తుడిచి స్టాండ్ తీసాడు. సైకిల్ కిర్రుమని మూల్గింది.

"అవ్వా!" మరోసారి పిలిచాడు.

"ఊఁ" నిద్రలోనే మూల్గింది ఎల్లవ్వ.

"నేను పోతున్న." సైకిల్‌ను ఎత్తి కడప దాటిస్తూ అన్నాడు.

ఉల్కిపడి లేచికూర్చుంది ఎల్లవ్వ. పక్కనే పడుకున్న చంటిపిల్ల ఏడుపును అందుకుంది పిల్లను జోకుడుతూ కొడుకువైపు భయంగా చూసింది. రాత్రంతా నిద్రలేదు. కళ్లు మండుతున్నాయి. లేని పాలకోసం తల్లిరొమ్మును చప్పరిస్తూ, ఆకలితో రాత్రంతా ఏడ్చిన చంటిపిల్ల, సొమ్మసిల్లినట్టుగా 'ఊఁ...ఊఁ' అంటూ చాపను కరుచుకుని పడుకుంది.

క్యారిల్‌కు కట్టిన చెక్కడబ్బాను సరిచూసుకుని సైకిలెక్కాడు. చంద్రం పెయ్యంతా జలదరించింది.

ఎల్లవ్వ గైన్లో నిలవడి వీధి లైటు వెలుతురులో కొడుకునే చూస్తుంది. అతడిని ఆపాలన్న ఆతృత. ఆపలేని అసహాయత. చీకట్లో ఒంటరిగా వెళ్తున్నందుకు ఆందోళన. ఒక్కసారిగా భర్త గుర్తుకచ్చి భయంతో వణికిపోయింది.

"పైలం బిడ్డా! మెల్లగపో. వాడుగిట్ల మళ్ల కనవడితే ఏమనకు. వాని తెరువు బోకు దున్నపోతులెక్క ఉన్నడు. మీదవడి కొడుతడు" గొణు

క్కున్నట్టుగా అన్నది.

వినపడీ వినపడని మాటలకు తలూపుతూ పైడీని బలంగా తొక్కాడు చంద్రం. రాత్రంతా అతడికి కూడా నిద్రలేదు. చెల్లెను భుజంపై వేసుకుని జోకాడుతూ అటూ ఇటూ తిరిగాడు. ఏదో తెలియని కసి. ఎవరిమీదనో కోపం. అది ఇప్పుడు సైకిల్ మీద చూపిస్తున్నాడు.

ఎల్లవ్వకు ఏవో భయాలు చుట్టుముట్టాయి. చుట్టూ దట్టమైన చీకటి ఆ భయాలను రెట్టింపు చేస్తుంది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తడిదేరిన కళ్లల్లో కొడుకు రూపం అస్పష్టంగా కదులుతుంది. తలుపుకు ఒరిగి అలాగే బీరిపోయింది. రెక్కలకింద దాక్కున్న పిల్ల మాయమైతే ఆగమై తిరుగుతున్న తల్లికోడిలా మనసు ఆరాటపడుతుంది. దుఃఖం తన్నుకువస్తుంది. అప్పుడే తెరలు తెరలుగా ముంచుకు వచ్చిన దగ్గు. రక్తం తెమడలు. నొప్పిగా ఉన్న దొక్కను నొక్కుకుంది.

సైకిల్ వేగం పెరుగుతుంటే చలి బాధ ఎక్కువవుతుంది. చేతులు కొంకర్లు పోతున్నాయి. దవడలు వణుకుతున్నాయి. గుండీలు తెగి గాలివిసురుకు తెరచాపలా లేస్తున్న అంగీని ఎడమ చేత్తో అదిమిపట్టుకుని కుడి చేత్తో సైకిల్ పట్టుకున్నాడు చంద్రం. గుండెలోని ఆతృత కాళ్లలోకి చేరుతుంటే డొక్కు సైకిల్ పైడీలు క్రుక్రుమంటూ గేర్‌కేస్‌ను తాకుతున్నాయి.

సైకిల్ చప్పుడుకు వీధిలైట్లకింద పడుకున్న కుక్కలు లేచి అరుస్తున్నాయి. అక్కడక్కడా సైకిల్‌కు అడ్డం తిరిగి మొరుగుతున్నాయి. బెల్‌మోగిస్తూ, వాటిని అదిలిస్తూ ముందుకు కదులుతున్నాడు చంద్రం. వీధి లైట్ల వెలుతురులో ఊరు దాటాడు.

ఊరవతల బస్టాండ్. నాలుగు గంటలకు వెళ్లే బస్సుకొరకు నలుగురైదుగురు ముడుచుకుని కూర్చున్నారు. అందులో ఆ ఊరి హెడ్మాస్టర్ కూడా ఉన్నాడని మాటలను బట్టి గుర్తించాడు చంద్రం. అతడికి ఎదురు పడాలంటే భయం. క్షణాల్లో సైకిల్ వేగాన్ని పెంచాడు. ఎలా గుర్తపట్టాడో కానీ 'చంద్రం' అంటూ పిలిచాడు హెడ్మాస్టర్.

సైకిల్‌కు బ్రేకులు పడ్డాయి. వెళ్లాలా వద్దా అని కొన్ని క్షణాలు తటపటాయించినా, స్టాండ్‌వేసి దగ్గరికి వెళ్లి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. చలి కడుపులోంచి ఎగతన్నుకు వస్తుంది. శరీరం గజగజవణుకుతుంది.

"మొన్న వీడు ఏడో తరగతిలో మండలానికే ఫస్ట్ వచ్చిండు. ఇప్పుడు ఎనిమిది పట్టంగనే బడికి బందుజేసిండు. తండ్రి ఉన్నప్పుడు ఒక్కనాడు బడికిరాకుంటే కొట్టుకుంట తోలుకత్తుండె. ఇప్పుడు తల్లి వీని గురించి పట్టించుకోదు. ఇట్లాబడికి మానేసిన పిల్లల కొరకే గవర్నమెంటు 'మళ్ళీ బడికి' పథకం పెట్టింది. ఇప్పటికైనా రారా అంటే వత్తనేలేదు. గవర్నమెంటు మనకొరకు ఎంత చేస్తోంది? మనమే ఉపయోగించుకుంటలేము." అంతవరకు ఊరికి తను ఎలా సేవచేస్తున్నాడో చెబుతున్న హెడ్మాస్టర్ మాటమార్చి అన్నాడు.

"ఈ పోరడు ఎప్పుడు చూసినా రోడ్లపొంట కనవడుతడు. అంత కాయ్దుసు కొద్ది చెప్పేసారు ఎవలుంటరురా! మంచిగ సదువుకోవచ్చు. వట్టిగాగోడిపోరడు.' ఒక ఆడమనిషి అన్నది.

"అవ్వకు టి.బి.రోగం, అయ్య ఉన్నప్పుడు చేసినందంతా దాని మందులకే సాలలేదు. ఇప్పుడో అప్పుడో అన్నట్టు కట్టెపుల్ల లెక్క అయితుంది. సావుదాలకు సమ్మర్త ముట్లన్నట్టు సంటిపిల్ల తల్లి. వీని తండ్రి గిట్లనే తెల్లతెల్లందాక సైకిల్‌మీద తిరిగుతుండె. ఇప్పుడు వీడు మొదలువెట్టిండు."

చలికి వణుకుతూ ముడుచుకు కూర్చున్న ముసలమ్మ శక్తినంతా కూడదీసుకుని నోరువిప్పింది.

చంద్రం కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"రేపటి నుండి బడికిరా, నీకు పైసలు బట్టలు వచ్చేటట్టు చేస్తా. ఇప్పటికి మస్తు మందికి ఇప్పిచ్చిన." హెడ్మాస్టర్ అన్నాడు. తలూపుతూ సైకిలెక్కాడు చంద్రం.

ఎవరో ఏదో అంటున్నారు. హేళనగా నవ్వుతున్నారు. చంద్రంకు సలీం గుర్తొచ్చాడు. భయం, కోపం రెండూ కలిగాయి. పండ్లు బిగపట్టి పైడిలను తొక్కాడు. కిర్రుమని మూల్గుతూ సైకిల్ బరువుగా కదిలింది.

వీధిలైట్ల వెలుతురు లేదు. చుట్టూ దట్టమైన చీకటి. జడల దయ్యాల్లా దారిపొడుగునా చెట్లు కీచురాళ్ల రోద. కంకరరాళ్లు తేలిన మట్టిరోడ్డు. ఎక్కడ గుంతలో, ఎక్కడ రాళ్లున్నాయో తెలియడం లేదు. రాళ్లను ఎక్కినప్పుడు, గుంతలకు దిగినప్పుడు సైకిల్‌పట్టు తప్పుతుంది. అడ్డంపడబోయి నిలదొక్కుకుని వెళ్తున్నాడు చంద్రం.

ఇంతకుముందు చీకటి అంటే భయంగా ఉండేది. పొద్దుపొడిచాక గానీ ఇంటిలోనుంచి కదిలేవాడుకాదు. సలీం ఊరిలోకి వచ్చాక ఆ పద్దతే మారిపోయింది. చీకట్లో బయలుదేరక తప్పిందికాదు. బతుకు మీద భయం మొదలయ్యాక చీకటి భయం తగ్గిపోయింది. ఒక తెగింపు వచ్చింది. అది మరి కొన్ని చిన్న చిన్న భయాలనుండి విముక్తున్ని చేసింది.

ఒకటి రెండు కాదు. రోజూ ఆరు కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లి డబల్ రొట్టెల కంపినీ చేరుకునేవాడు. డెబ్బయి అయిదు పైసలకొక డబల్ రొట్టె చొప్పున కొని చెక్కడబ్బాలో వేసుకుని తిరిగి వచ్చేవాడు. పావలా కమీషన్ మీద ఊరంతా తిరిగి అమ్మేవాడు. ఒక్కటి మిగలకుండా అమ్ముడుపోయేవి. ఎన్నడైనా ఒకటి రెండు మిగిలితే చెల్లెలికి ఇచ్చేవాడు.

వారంరోజుల క్రితం సలీం ఊరిలోకి వచ్చాడు. రావడం తెల్లారకముందే వచ్చాడు. వాడిది కంచుకంఠం. అప్పుడప్పుడూ పిల్లిలా, కోడిలా, మేకలా అరుస్తూ పిల్లలను ఆకట్టుకుంటాడు. కొత్త సైకిల్. గిర్రగిర్రని ఊరంతా నాలుగు చక్కర్లు కొడతారు. సైకిల్‌కు బస్ హారన్ పెట్టుకున్నాడు. పాం..... పాం... అని నొక్కుతుంటే పిల్లలంతా చుట్టుముట్టుతున్నాడు. హుషారుగా, కలుపుగోలుగా ఉండి 'రొట్టే... రొట్టే... డబల్‌రొట్టే... కొనియ్యమంటే పోరన్ని గొట్టే' అని అరుస్తూ అందరినీ నవ్విస్తాడు.

వాడి స్వంత ఊరు గంభీరావుపేటనే! డబల్‌రొట్టెల కంపినీ ఉన్నది ఆ ఊరిలోనే! చంద్రం ఇక్కడ బయలుదేరే సమయానికి సలీం అక్కడ బయల్దేరుతాడు. డొక్కుసైకిల్ మీద మూల్గుతూ ముక్కుతూ చంద్రం తన ఊరికి చేరుకునేలోపే సలీం ఊరంతా తిరిగి చెరువు కొమ్ముకు ఎదురవుతాడు.

వరుసగా మూడురోజుల ఇలాగే జరిగింది. చంద్రంకు ఒక్కరొట్టెకూడా అమ్ముడుపోలేదు. వెళ్లి కంపెనీ యజమానితో చెప్పుకుని సలీంను తన ఊరికి రావద్దని చెప్పమన్నాడు.

"అరే ఓ పాగల్.... వాడు రోజుకు ఆరువందల రొట్టెలు అమ్మతడు. రొట్టెకు ఎనభైపైసలిత్తడు. ఏదో తండ్రిలేని పోరనివని బారానకు ఒక రొట్టె ఇత్తున్నగని అందిరికి నీలెక్క ఇత్తున్ననను కుంటున్నవా ఏంది? ఇప్పుడు మీ ఊర్లెకు రావద్దంటే వాడు నా కంపినికి బందు వెట్టి ఇంకో కంపెనికి పోతడు. నీ వంద రొట్టెల కొరకు ఆరువందలోన్ని ఇడిసిపెడుతనా... నీకు దమ్ముంటే వేరే

ఊర్లు తిరుగు. వద్దంటున్ననా!" విసురుగా అన్నాడు ఓనర్.

'చీకటంటే తనకు భయమని రాత్రిపూట రాలేనని సాయంత్రమే రొట్టెలు ఇవ్వాలని' బతిమాలాడు చంద్రం. ఓనర్ మాటలకు దుఃఖం, కోపం ముంచుకువచ్చినా దిగమింగు కుంటున్నాడు.

"నీకు ఒక్కనికి ఇస్తే వాళ్లు ఊకుంటార్రా! అందరు కావాలంటరు. మాపటాల్ల వరకు అన్ని రొట్టెలు యాడ తయారైతయి. మబ్బుల వరకైతే తయారైతయి. మబ్బులవచ్చి తీసుకపో" అన్నాడు.

విషయం తల్లికి చెప్పాడు చంద్రం. రోజుకంటే గంట ముందుగా, పొద్దు పొడవకముందే నిద్రలేపి పంపింది. అలాగైనా సలీంను అందుకోలేకపోయాడు. ఊరు చేరేవరకే రొట్టెలన్నీ అమ్ముకున్నాడు.

కోపం వచ్చి సలీంతో కలియబడ్డాడు చంద్రం. వాడు చంద్రంకంటె పెద్దవాడు. బలంగా, దృఢంగా ఉంటాడు. మట్టిలో బొర్రిచ్చుకుంటూ కొట్టాడు. రోడ్డునవెళ్ళేవారు విడిపించారు. చినిగిన అంగీ, ఒళ్లంతా దుమ్ముతో ఏడుస్తూ నిలబడ్డాడు చంద్రం. సలీం వగరుస్తూ సైకిలెక్కి వెళ్లిపోయాడు.

అలాగే కంపెనీకి వెళ్లాడు చంద్రం. ఆలస్యమైతే రొట్టెల వాపసు తీసుకోడు. తనవద్ద దాచిపెట్టి మరునాడు అమ్మదామంటె రొట్టెలు గట్టిగ బొక్కలోలే అయి ఎవరూ కొనరు. కొన్నాగానీ నిన్నటి రొట్టెలు అమ్ముతున్నవని వాపసు ఇస్తారు.

కంపెనీ ఓనర్ చంద్రంను చూసి తిట్లు అందుకున్నాడు. మళ్లీ ఒకసారి వాపసు తెస్తే కంపెనీ గేటుకూడా దాటనివ్వనని హెచ్చరించాడు.

దిగులుగా ఇంటికి చేరుకున్నాడు చంద్రం. ఆశగా చూస్తున్న ఎల్లవ్వ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అప్పటికి రొట్టెలు అమ్మక నాలుగు రోజులయింది. ఏ రోజుకు ఆరోజే తెచ్చుకునే సరుకులు నిండుకున్నాయి.

"అవ్వా! నన్ను మబ్బుల నాలుగు గంటలకే నిద్రలేపు. ఆ తుర్కోనికంటే ముందుగల్లనే రొట్టెలు తెచ్చి అమ్ముత. చెల్లెకు పాలు కొందామన్నా పైసలు లేకపాయె. ఇయ్యల్లరేపైతే బువ్వ కూడా కరువైతది. ఒకవారం పదిరోజులు వరుసగా పోయిన్ననుకో! ఇగవాడు బందుజేస్తడు." తల్లికి సర్ది చెబుతున్నట్టుగా అన్నాడు.

ఆందోళనగా కొడుకును దగ్గరికి తీసుకుంది ఎల్లవ్వ. పన్నెండేళ్ల వయసులోనే తనకు కొండంత అండలా నిలిచిన కొడుకు జీవిత పోరాటం కొరకు ఆరాటపడుతున్న తీరు ఆమెను కదిలించింది. కన్నీటితో కరిగిపోతూ కొడుకు తలను నిమిరింది.

చాలా రోజుల తర్వాత రెండేళ్లక్రితం అయిన కానుపు, ఇరుగుపొరుగు వాళ్ల విసుర్లు కుంగ దీస్తుంటే.... ఎప్పుడు కబలించిందోకానీ టి.బి. అప్పుడే బయటపడి మరింత కృంగదీసింది. మూడు నెలల క్రితం వరకు ఎలాగో రోజులు గడిపిన ఎల్లవ్వ భర్త మరణంతో ఆగమైపోయింది.

"వద్దు బిడ్డో... నీకాళ్లు మొక్కుత. బతికినకాడికాయె. పొట్టకు లేకపోతే బుచ్చం అడు క్కుందాం. చీకటిపూట నిన్ను తోలను." ఆబగా దగ్గరికి తీసుకుంటూ అన్నది.

రెండు రోజులు గడిచాయి. ఆకలి భయం తెలిసివచ్చింది. బతకడం అంతతేలికైన విషయంకాదని తెలిసిపోయింది. బాగా ఆలోచించి చెక్కడబ్బాను తుడిచి సైకిల్‌కు కట్టింది ఎల్లవ్వ.

ఏం చేయాలో తెలిసిపోయింది చంద్రంకు. ఆరెండు రోజులకే కడుపునింపడానికి తల్లిపడిన అవస్థలు అతడిని కృంగదీస్తున్నాయి. ఏదైనా హోటల్‌లోనో, సైకిల్ టెక్స్‌లోనో పని దొరుకుతుందేమోనని చూసాడు. ఎక్కడా దొరకలేదు.

పట్టుదలతో మరునాడు రాత్రి నాలుగు గంటలకే బయలుదేరాలనుకున్నాడు చంద్రం. మొదట పంపించాలనే నిర్ణయించుకుంది కానీ చీకటినిచూసాక ధైర్యం చాలలేదు ఎల్లవ్వకు. అందుకే కొడుకును నిద్రలేపలేదు.

చంద్రంకు మాత్రం నిద్రపట్టలేదు. అటుదొర్లి ఇటుదొర్లి లేచి సైకిల్ అందుకుని ఇప్పుడు ఇలా వెళ్తున్నాడు.

ఊరునుండి దూరమౌతుంటే చలి మరింత ఎక్కువయింది. కట్టుకాలువ ఎదురుగడ్డకు కదలలేనని సైకిల్ మొరాయించింది. సీటు దిగి దండతొక్కడం మొదలెట్టాడు చంద్రం. అప్పుడప్పుడూ ఫ్రీవీల్ పట్టుకోవడం లేదు. వెనుకనున్న చెక్కపెట్ట దడదడమంటుంది. నిశబ్దవాతావరణంలో సైకిల్‌లో ప్రతీ పార్టు చేసే చప్పుడు విడివిడిగా స్పష్టంగా వినిపిస్తున్నాయి.

'వీని సైకిల్‌కు బెల్ తప్ప అన్నీ మోగుతాయి' అంటూ హేళన చేసే మిత్రులు, సైకిల్‌ను చూసి నవ్వే సలీం గుర్తొచ్చాడు. ఎగదన్నుకు వస్తున్న దమ్మును బిగవట్టుకుని కసిగా తొక్కుతున్నాడు. అంతచలిలోనూ నుదుటన చెమట పుట్టింది.

మూడు కిలోమీటర్లు దాటి మెయిన్‌రోడు ఎక్కాడు చంద్రం. కలవరపాటుగా అతడిగుండె కొన్ని క్షణాలు దడదడలాడింది. సైకిల్ ఆగిపోయింది అక్కడ.... ఆ దృశ్యం ఇంకా మనసులోంచి చెరిగిపోలేదు. రక్తం మడుగులో తండ్రి శవం. నెత్తురు చిందిన డబల్ రొట్టెలు. రొట్టెల కొరకై ఎగబడుతున్న కాకులు. క్షణకాలం ఒల్లు జలదరించింది. అర్థమై, అర్థంకాని జీవిత రహస్యమేదో బోధపడినట్టు చీకట్లో నిలబడిపోయాడు.

దూరంగా ఉన్న లంబాడి తండాలో కోడి కూసింది. నిద్రలోంచి మెలకువ వచ్చినట్టు ఉల్కిపడ్డాడు చంద్రం. సైకిల్‌ను ముందుకు కదిలించి పైడీపై అడుగు వేయబోయాడు. పట్టుతప్పి తూలిపడబోయి నిలదొక్కుకున్నాడు. చీకటిని చీల్చుకుంటూ పక్కనుంచి పత్తి లారీ ఒకటి పెద్ద శబ్దం చేస్తూ వెళ్లిపోయింది.

దూరంగా ఎవరిదో సైకిల్ చప్పుడు వినిపించింది. అది సలీందేమోనన్న భయం పట్టుకుంది చంద్రంకు. చీకట్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ సైకిల్ వేగం పెంచాడు. ఎంత సమయం పట్టిందో కానీ కంపెనీ చేరుకునేవరకూ ఇంకా తెల్లారనేలేదు.

అప్పుడప్పుడే సైకిళ్లు చేరుకుంటూన్నాయి. వారిలో సలీంకొరకు వెదికాడు చంద్రం. అతడుకనిపించలేదు. మనసు కొద్దిగా కుదుటపడింది. అయినా ఏదోమూల అనుమానం. తెలిసిన వారితో సలీం గురించి ఆరా తీసాడు. వారు కనిపించలేదని చెప్పారు. ఉద్దెర అడిగి వంద రొట్టెల్ని డబ్బాలో నింపుకుని సైకిలెక్కాడు.

అప్పటికీ చీకటిగానే ఉంది. చలివిసురుతూనే ఉంది. వేడి వేడి చాయతాగాలనిపించింది. తొందరగా ఊరు చేరుకోవాలన్న ఆరాటం అతడిని క్షణం కూడా నిలువనీయడం లేదు'. మొత్తం రొట్టెలు అమ్ముడుపోతాయి. పైసలు అవ్వకియ్యాలె. చెల్లెలికి పాలు కొనుక్కరమ్మని చెప్పాలె. రెండు

మూడొద్దులు ఇట్లనే రావాలె. సలీంగాడు సల్లవడుతడు. మొత్తం అమ్ముకుని వాడచ్చే వరకు ఎదురుంగ నిలవడాలె. తాత కొడుక్కు కుక్కను ఎగవెట్టాలె. కుక్కలన్ని గలిసి వాని మీదికి ఉరుకాలెనట. మీదవడి తుక్కుతుక్కు కొరుకాలెనట. రొట్టెలనన్ని తినాలెనట. ఇగజూడు మల్ల మల్లరెడ్డి పేటంటే పంచితం రాలుతది.' మనసులో అనుకుంటూ సైకిల్ తొక్కుతున్నాడు చంద్రం.

ఎగుడు, దిగుడు, కంకర తేలిన రోడ్డుదాటి మెయిన్ రోడ్డు ఎక్కినాక సైకిల్ ముందుకు కదల్లేదు. భయం భయంగా సైకిల్ దిగి వెనుక ట్యూబ్‌ను ఒత్తి చూసాడు. చీకట్ల ముల్లే దిగిందో కొచ్చెటి కంకరరాయే కొట్టిందో పంక్చర్ అయినట్టుంది.

ఊపిరి ఆగిపోయినట్టయింది చంద్రంకు. అలాగే ఎక్కి తొక్కాలని ప్రయత్నం చేసాడు. రాళ్లురీముకు గుద్దుతున్నాయి. రీం వంకర పోవచ్చు. ట్యూబ్ నలిగిపోవచ్చు. మళ్లీ రెండు మూడు వందల ఖర్చు. సైకిల్‌కూడా ముందుకు జరగడంలేదు. ఉసూరుమని కిందికిదిగి నడవడం మొదలెట్టాడు చంద్రం.

అప్పుడప్పుడే తెల్లవారుతుంది. ఏడుపు, కసి, కోపం, సైకిల్‌మీద చూపిస్తూ వడివడిగా అడుగులు వేస్తున్నాడు చంద్రం. 'బోషిడికొడుకుకును తుక్కుతుక్కు నరుకాలె. చీకట్ల ఏలారీ కింద పడైనా సచ్చిపోతడు....' ఆలోచనలు ఆగిపోయాయి. తండ్రి గుర్తొచ్చాడు. అతడి చావు గుర్తొచ్చింది.చెల్లెలి ఏడ్పు అవ్వ ఆకలి అన్నీ గుర్తొచ్చాయి. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వెనుకాముందూ చూస్తూ గబగబా నడుస్తున్నాడు. అప్పుడప్పుడూ పండ్లు కొరుక్కుంటూ 'చీ... గంత సబ్బులలేచి ఏం లాభం' అనుకుంటున్నాడు. ఆకు చప్పుడైనా భయంగా సలీంవస్తున్నాడేమోనని చూస్తున్నాడు.

చంద్రం భయపడినట్టే జరిగింది. మెట్టుగుట్టలు దాటి సంగయ్య మామిండ్లకు రాగానే సైకిల్ చప్పుడువినిపించింది. ఊరు ఇంకో అరకిలోమీటర్ దూరంలోఉంది. దూరంనుండే సలీంసైకిల్‌ను గుర్తుపట్టాడు చంద్రం. గుండె దడుక్కుమంది. నడకవేగం పెంచాడు. రోడ్డుమధ్యలోకి వచ్చి అంతా తానై దారి ఇవ్వకుండా నడవడం మొదలుపెట్టాడు. బెల్‌మోగిస్తూ పక్కనుండి సలీం వెళ్లిపోయాడు.

చంద్రం ప్రాణం గిలగిలలాడింది. పిడికిలిని బిగవట్టి 'దీని గత్తర్రాను. ఇప్పుడే పంపుచారైంది.' అంటూ సీటు మీద దబదబా కొట్టాడు. గొంతెత్తి' ఓరేయ్ లంబిడి కొడుకా... నువుచాన రోజులు బతుకవు. నరుకుతరరేయ్' కోపంగా అరిచి ఒక్క గెంతులో సైకిల్ ఎక్కాడు. అది కదలలేదు. దిగి సైకిల్‌ను నెట్టుతూ పరుగు అందుకున్నాడు.

ఆయాసం, ఊపిరి ఎగదన్నుకువస్తుంది. తన సంపద ఎవరో ఎత్తుకుపోతున్న ఆందోళన, పరుగెత్తుతుంటే డొక్కలో నొప్పి మొదలయింది. లెక్కచేయకుండా ఎవరో తరుముకువస్తున్నట్టు ఊరికి చేరుకున్నాడు చంద్రం.

కోటగట్టను ఎక్కి కొన్ని క్షణాలు ఆగి చెవులు రిక్కించి విన్నాడు. దూరంగా ఇసన్నకాలు వసందివైపు సలీం అరుపులు వినిపిస్తున్నాయి. వెంటనే సైకిల్ వెనక్కి తిప్పి ఎరుకలి గడ్డను ఎక్కి సాకలిండ్లకుదిగాడు చంద్రం. అతడి మనసు కొద్దిగా కుదుటపడింది. సలీం కచీరుకాడికి వచ్చేవరకు సగం ఊరైనా తిరగాలనుకున్నాడు. కుమ్మరిండ్లు. గరిషలగడ్డ, పక్కీరోల్ల సంది, జక్కువాడ తిరిగి చైతన్యపురి కొత్తబడికాడికి వెళ్లేచాలు అనుకున్నాడు.

'గురుజుకాడా పెద్దోళ్లు, కోటకాలువకాడి డాక్టర్ వెంకటి చైతన్యపురికాలనీ నారాయణసారు, యాదగిరి, బాల్‌రెడ్డి పంటేండ్ల పిల్లలు రోజూ కొనేటోళ్లు. వాళ్ల గిరాకీ పోనీయద్దు.' అనుకుని 'డబల్‌రొట్టె.... డాబాల్‌రొటీ....' అన్నాడు గొంతెత్తి.

అప్పటికే పూర్తిగా తెల్లవారింది. మగవాళ్లు బర్ల పెండతీసి తొక్కుడు గడ్డితో చలిమంటవేసుకున్నారు. ఆడవాళ్లు తలలకు గంద్రపేగులు కట్టుకుని వాకిళ్లు ఊడుస్తున్నారు. మరో రెండుసార్లు గట్టిగా అరిచాడు చంద్రం. సలీంను అనుకరించాలని కాకిలా అరవడానికి ప్రయత్నించాడు. చలిమంట కాగుతున్న వాళ్లు విచిత్రంగా చూడడంతో ఆపేసాడు.

పిల్లలు పరుగెత్తుకువస్తున్నారు. కొందరు మక్కలు, కొందరు వడ్లు అంచెలల్లో తెస్తున్నారు. ఇంతకుముందైతే లెక్క తెలువదని ధాన్యం తీసుకునేవాడు కాదు. పైసలే తెమ్మనేవాడు. ఇప్పుడు ఏది తెచ్చినా వద్దనడంలేదు.

నెత్తికున్న తువ్వాలను విడిచి రెండుమడతలు మలిచి సైకిల్‌కు కట్టాడు. ఒక మడతలో వడ్లు ఇంకోమడతలో మక్కలను పోస్తున్నాడు. చలినుండి కాపాడుకోవడానికి ఆ మాత్రంగానైనా ఉన్న తువ్వాల ఇప్పుడు లేకపోవడంతో కాళ్లుచేతులతో పాటు తలకూడా మొద్దుబారిపోయింది. ఆ చెవుకు సలీం అరుపులు తప్ప ఏవీ వినిపించలేదు.

టకటకా పది రొట్టెలవరకు అమ్మాడు. పిల్లలు ఎంతవేగంగా ఇండ్లలోకి వెళ్ళిపోయారో అంతేవేగంగా సైకిల్‌వద్దకు వచ్చారు. వెంట తల్లులు కూడా ఉన్నారు.

"ఇదేం అన్యాయంరా చెందురుగా... నిన్న మొన్న గంబిరపాట తురుకాయిన బారానకు ఒకటి ఇచ్చిండు. నువ్వేమో రూపాయి తీసుకున్నవు. అన్నాలమా అపకీర్తా! నీ బుద్దుంటే బారానకు (డెబ్బైఐదు పైసలు) ఒకటి ఇయ్యి. లేకుంటే లేదు." రొట్టెను అందిస్తూ అన్నారు.

తెచ్చినరేటుకే అమ్మితే ఎలా అని కొద్దిసేపు చంద్రంకు ఏమీ అర్థంకాలేదు. ఆలోచిస్తుంటే తనను దెబ్బతీయడానికి సలీం ఎలాంటి ఉపాయాన్ని పన్నాడో అర్థమయింది. అప్పుడప్పుడూ తల్లి చెప్పే మాటలు గుర్తొచ్చాయి. 'వాళ్లిండ్లు మునుగ బిడ్డా. ఉన్నోళ్లను ఉన్న జాగల ఉండనియ్యక పోయిరి. ఎడ్ల బండిమీద రైసుమిల్లుకు వడ్లు జారగొట్టిన్నాడు ఏరందిలేకుండే' అనేది.

తండ్రి కోమట్లుకొన్న వడ్లను బండిమీద దగ్గరలో ఉన్న రైస్‌మిల్లుకు జేరవేసేవాడు. సంచికి ఐదురూపాయలు తీసుకునేవాడు. అందరూ బాడిగ మల్లయ్య అని పిలిచేవారు. రైతుల్లో నే ఇద్దరు బయల్దేరారు. సంచికి రెండు రూపాయలే తీసుకుంటామన్నారు. గిరాకీ మొత్తం వారిసొంతమయింది. మల్లయ్యకు ఎవరూ పని చెప్పలేదు. ఆ రేటుకు గిట్టుబాటులేక ఎడ్లను, బండిని అమ్ముకున్నాడు. తర్వాత వారు సంచికి పది రూపాయల రేటును పెంచారు. పోటీ లేకుండ చేయడానికి రేటును తగ్గించారు.

"ఏందిరా.... చెట్టోలె అట్లనే బీరిపోతవు." కసురుకున్నట్టుగా అన్నారు. వెంటనే తేరుకుని వారికి పావలా వాపసు ఇచ్చాడు. ముందుకు నడిచి మరో సందు తిరిగి అక్కడ రూపాయికి అమ్మజూసాడు. వారు కూడా అలాగే అన్నారు.

అనుకున్నట్టుగా సందులు తిరిగి గురుజుదాటి కచీరుకాడికివచ్చాడు చంద్రం. సలీం పోచమ్మవాడకట్టునుంచి గాంధీవద్దకు ఎదురొచ్చాడు. చంద్రంను చూడగానే గుర్రంలా సకిలించి,

పాంపాం మని హారన్‌ను నొక్కి 'డబల్ రొట్టె. కమ్మగా తియ్యగా, ఏసుకోరపిల్లగా... బారానకొకటి, రెండ్రూపాయలకు మూడు, ఐదున్నరకు ఎనిమిది' అన్నాడు.

చంద్రం కళ్లు కోపంతో ఎర్రబడ్డాయి. తన సైకిల్‌ను సూటిగా సలీం ముందుకునెట్టి అడ్డంగా నిలబడ్డాడు. వారి ముఖాల్లో, చూపుల్లో, చేష్టల్లో కలిగిన మార్పులను కొందరు వినోదంగా చూస్తున్నారు. యుద్ధ రంగంలో ఎదురైన శత్రురాజుల్లా ఉన్నారిద్దరు. కొన్ని క్షణాలు సూటిగా చూసి పక్కనుండి వెళ్లిపోయాడు సలీం.

ఆశగా సైకిల్‌ను నెడుతూ రెండుసార్లు ఊరంతా తిరిగాడు చంద్రం. వచ్చిన ధాన్యాన్ని అమ్మి రొట్టెలు లెక్కచూసుకున్నాడు. ఇంకా పది రొట్టెలు మిగిలాయి. మిగిలిన రొట్టెల్ని రాములు హోటల్‌లో పెట్టాడు. 'ఒకటి రెండు అయితే వేరు. ఇంతగానం యాడ పెడుతవురా' అని విసుక్కున్నాడు రాములు.

సైకిల్‌ను రిపేరు షాపువద్దకు తీసుకెళ్లాడు. రెండు పంక్చర్లకు, చిన్న చిన్న రిపేర్లకు ఆయిల్‌కు పది రూపాయలైనవి. సైకిల్ రిపేర్ చేసేంత సేపట్లో రెండుసార్లు హోటల్‌కు వెళ్లివచ్చాడు. రొట్టెలు అలాగే ఉన్నాయి. మనసంతా దిగులు చోటుచేసుకుంది. మూడవసారి సైకిల్‌ను తీసుకుని వెళ్లేసరికి హోటల్ ముందు ఎవరిదో పెళ్లి జీపు ఆగి ఉంది. చిన్నా పెద్దా టీ తాగుతూ రొట్టెలు తింటున్నారు. లక్షల కోట్ల ఆస్తి స్వంతమైనట్టు సంబరపడిపోయాడు చంద్రం.

"ఒరే పోరడా... మల్లా రొట్టెలు తేకు. ఏదో పాపమని రూపాయికొకటి అమ్మిన. వాడు రేపటినుండి ఇంకింత మబ్బుల వస్తడట. వాన్ని జూసి నువ్వు తెల్లందాక పోకురా. మీ నాయిన గట్లనే లారీ గుద్ది సచ్చిపోయాడు." మందలిస్తున్నట్టుగా అన్నాడు రాములు. పదిరూపాయలనోటు ఇస్తూ.

డబ్బును లెక్క చూసుకున్నాడు చంద్రం. సైకిల్ ఖర్చుపోనూ డెబ్బై రూపాయలున్నాయి. కంపెనీ ఓనర్‌కే డెబ్బయిఐదు రూపాయలియ్యాలె. ఆలోచిస్తూనే ఇల్లును చేరుకన్నాడు చంద్రం.

తల్లి వాకిట్లోకి ఆత్రుతగా ఎదురొచ్చింది. తర్వాత ఖాళీ డబ్బాను చూసింది. ఆమె కళ్లల్లో తృప్తి. కొడుకును దగ్గరికి తీసుకుంది.

"వాని తలపండు పలుగ. మల్లా వచ్చిండుగదా! పొట్టుపొట్టు తిట్టిన. సిగ్గుశరంలేనోడు. కుయ్యిమనలేదు. కయ్యిమనలేదు. మనగోసపుచ్చుకోవట్టె. అన్నీ అమ్ముడుపోయినయి గదా' తల నిమురుతూ అన్నది.

తల్లి కళ్లల్లో మెరుపును చూసాక నిజం చెప్పాలనిపించలేదు చంద్రంకు. తలూపుతూ ఇరవై ఐదు రూపాయలు తీసి చేతికిచ్చాడు. డబ్బుతీసుకుని దుకాణంవైపు వెళ్లింది ఎల్లవ్వ. సగంతెగిన నులకమంచంను వాల్చి అలసటగా ఒరిగాడు చంద్రం.

అతడి మెదడులో సేటుకు ఇచ్చే డబ్బులే మెదులుతున్నాయి. ఈ డబ్బులివ్వకపోతే రేపు రొట్టెలియ్యడు. సైకిల్‌ను కదలనియ్యడు, ఇంతకుముందు ఒకరిద్దరిని ఆయాసపెడుతుంటే చూసాడు. కాళ్లావేళ్లా బతిమాలినా మాలు ఇయ్యలేదు.

చంద్రంకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఎక్కువ రొట్టెల్ని అమ్మి బాకీ తీర్చవచ్చునను కున్నాడు. తనకు నమ్మకమున్న వారందరిదగ్గరికి అప్పుకు తిరిగాడు. జరిగిన విషయమంతా చెప్పి, ఒకవారం రోజులు నేనే ముందుగా వస్తే సలీం రావడం మానేస్తాడని అప్పుడు రోజుకింత అప్పు

తీరుస్తానని చెప్పాడు.

అతడి సమస్య వారందరికీ నవ్వులాటగా మారిపోయింది. ఎక్కడా అప్పుపుట్ట లేదు. తల్లికి విషయం చెబితే ఎక్కడైనా అప్పు తేస్తుంది. కానీ విషయం ఆమెకు తెలిసినాక ఆమె బాధపడటం ఇష్టంలేదు. తన కష్టంమీదనే ఇల్లుగడుస్తుందన్న భావన అతడికి గొప్ప తృప్తినిస్తుంది. వెంటనే సూరులో భద్రంగా దాచి పెట్టిన చిన్న డబ్బాను తీసాడు. ఆ పని చేస్తుంటే అతడి చేతులు వణుకుతున్నాయి.

ఎర్రారాయితో చేసిన బంగారు ముక్కుపుల్ల బయటపడింది. తన తల్లి అపురూపంగా చూసుకునేది, పండుగలకు పబ్బాలకు పెట్టుకుని దాచుకునే ముక్కుపుల్ల. ఈమధ్య చాలా రోజులనుండి దానిని బయటకు తీయడంలేదు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువు అదొక్కటే. తల్లికి కనిపించకుండా జేబులో వేసుకున్నాడు.

ఒక్కక్షణం కూడా ఇంట్లో నిలువబుద్ధి కావడంలేదు. వస్తువైతే తీసాడుకానీ ఎక్కడ కుదువబెట్టాలో తెలియడంలేదు. ఓనర్‌కు ఇచ్చి డబ్బు ఇచ్చాకే తీసుకపోతానని చెబితే అయిపోతుంది కదా అనుకున్నాడు. ఆ ఇచ్చేదేదో ఇప్పుడే ఇస్తే మంచిది. పొద్దంతా నా వద్ద ఉంచుకోవడం దేనికి అనుకున్నాడు. వెంటనే అన్నంతిని సైకిలెక్కాడు. గంటలో డబల్‌రొట్టెల కంపెనీ ముందున్నాడు.

పొట్లంలో మడిచి భద్రంగా ఇచ్చిన ముక్కుపుల్లను పురుగులా చూసాడు ఓనర్. దాని విలువ యాభై రూపాయలైనా ఉండదని హేళన చేస్తూ ఈ రోజు రొట్టెల బకాయి రేపు పొద్దున ఇస్తేగానీ రొట్టెలియ్యనని ఎగవేయాలని చూస్తే ఇంటికివచ్చి సైకిల్ గుంజుకొస్తానని హెచ్చరించాడు.

కొండంత ఆశతోవచ్చిన చంద్రం నీరుగారిపోయాడు. గుండెలో దడదడ మొదలయింది. చాలా సేపటి వరకు ఓనర్‌ను బతిమాలాడు. అతడు వినలేదు. విసుక్కున్నాడు. రేపు రొట్టెలు ఇవ్వడని, డబ్బు ఇవ్వకపోతే ఇంటికి వస్తాడని తెలిసిపోయింది. విషయం తల్లికి చెప్పక తప్పదనిపించింది. నీరసంగా సైకిలెక్కాడు చంద్రం. ఎందుకోకాని విషయం తల్లికి చెప్పాలని నిర్ణయించుకున్నాక ఇంటికి వెళ్లాలంటే భయమేస్తుంది.

మనసులో ఆశచావక మరో రొట్టెల కంపెనీకి వెళ్లాడు. ఓనర్‌ను కలిసి తననుతాను పరిచయం చేసుకున్నాడు.

"నాపేరు చంద్రం... మాది మల్లరెడ్డిపేట. మాదిగోల్లం. మా నాయిన సచ్చిపోయిండు సార్. పొద్దంతా కైకిలు పోతుండె. మబ్బులనే లేచి వచ్చి రొట్టెలు అమ్ముతుండె. మూన్నెళ్లకింద రొట్టెలు కొండపోతుండగా మేన్‌రోడు మీద లారీగుద్దింది...." అంటూ మొదలుపెట్టి వివరంగా చెప్పాడు చంద్రం.

అతడి బుగ్గలపై జారుతున్న కన్నీరు కానీ, కష్టాలు కానీ అతడిని కరిగించలేదు కానీ ఒక ఊరిలో మార్కెట్ సంపాదించాలనుకున్న ఆలోచన అతడిని చేరదీసింది.

తక్కువపడిన డబ్బు ఇస్తానని ఆ కెంపెనీకి మానేయమని, ఎనభైరూపాయలకు వంద చొప్పున ఎన్ని రొట్టెలయినా తీసుకుపొమ్మని, అవికూడా సాయంత్రమే ఇస్తానని అంత పొద్దున రావద్దని చెప్పాడు.

ముందుగా తన చెవులను తానే నమ్మలేకపోయాడు చంద్రం. ఓనర్ అతడికి దేవుడిలా కనిపించాడు ఏదో ఆనందం... ఏదో ఆరాటం... అప్రయత్నంగా అతడి పెదవులపై చిరునవ్వు.

పొట్లంలో భద్రపరిచిన ముక్కపుల్లను అతడికి అందించాడు. దానిని చూసి నవ్వుతూ చంద్రంకు అందించి చెప్పాడు ఓనర్.

"ఇది వద్దు! నీదగ్గర నీతి ఉందిరా. అందుకే నిన్ను నమ్ముతూ మాలు ఉద్దెర ఇస్త. ఎంత అమ్ముడైతే అంత తీసుకపో!' అంటూ ముప్పయి రూపాయలు అందించాడు.

పాత ఓనర్ బాకీ తీర్చి సాయంత్రం వరకు అక్కడే ఉన్నాడు చంద్రం. రొట్టెల్ని డబ్బలో నింపుకుని మసక పడుతుండగా ఇల్లు చేరుకున్నాడు. కథంతా చెప్పలేదుకానీ వేరే కంపెని నుండి తెచ్చానని ప్రతీ రోజూ ఇలాగే తెస్తానని చెప్పాడు.

కొడుకు ప్రపంచాన్నంతా జయించి తన పాదాలముందు నిలిపినంతగా సంతోషపడిపోయింది ఎల్లవ్వ. కష్టాల్లో పుట్టి కష్టాల్లో పెరిగి కష్టాన్నే నమ్ముకుని ఆ కష్టం చేయడానికే దూరమయ్యాక మొదటి సారిగా తృప్తిగా నవ్వింది.

"ఇంకో నాలుగురోజులైతే వాగులరోడ్డు పోత్తరట. డాంబరు రోడయితదట. గొల్లపెల్లి చానా దగ్గరైతది. అంతదూరం పోవుడు తప్పుతది. ఇటే పొయ్యి తెచ్చుకోవచ్చు." అన్నది.

మరునాడు పొద్దున్నే పోరాటం తర్వాత తన రాజ్యాన్ని హస్తగతం చేసుకున్న మహారాజులా సైకిల్‌పై ఊరంతా తిరిగాడు. ఒకసారి, రెండుసార్లు... ఒక్క రొట్టె మిగలకుండా అమ్ముడుపోయేంత వరకూ తిరిగాడు. ఖాళీ డబ్బాతో కచీరుకాడికి వచ్చాడు.

సలీం రావడం నిరాశగా వెళ్లిపోవడం తృప్తిగా చూసాడు. వెక్కిరించాడు నవ్వుకున్నాడు. అలాగే మూడురోజుల వరకూ అదే రేటుకు అమ్మాడు. రోజూ తల్లికి డబ్బు ఇస్తూనే కంపెనీలో ఖాతా ఉద్దెర పెట్టాడు.

చంద్రం సాయంత్రమే రొట్టెలు తెచ్చుకుంటున్నాడని తెలిసాక ఊరిలోకి రావడం మానేసాడు సలీం. చంద్రం ఈ విషయం రూఢీ చేసుకున్నాక ముందటిలాగే ఒక్కొక్కదానికి రూపాయి రేటును చెప్పాడు. అడిగిన వాళ్లందరికీ రొట్టెల రేటు పెరిగిందని చెప్పాడు. ఒకటి రెండు రోజుల్లో అందరూ సర్దుకున్నారు.

ఇప్పుడు రొట్టెలు ఎక్కువగానే అమ్ముడవుతున్నాయి. రోజూ నలభై, యాభై రూపాయలు మిగులుతున్నాయి. కొద్ది కొద్దిగా డబ్బును దాచి మందులు కొనుక్కుంటుంది ఎల్లవ్వ. ఆరోగ్యం కొద్దిగా కుదుటపడింది. ఆరు నెలలు గడిచాయి.

ఒకనాడు ఎప్పటిలా సైకిలు బయటకు తీస్తూ రెండు లూనాలను చూసాడు చంద్రం. వాటికి పెద్ద పెద్ద సంచులు, అందులో ప్లాస్టిక్ కవర్లు, కవర్లలో డబల్‌రొట్టెలు, బ్రెడ్ ప్యాకెట్లు ఉన్నాయి. డబల్‌రొట్టెలు తను అమ్మెరొట్టెకంట కొద్దిగా చిన్న సైజుల్లో ఒక్కొక్క కవరుకు ఐదేసి చొప్పున ఉన్నాయి. మూడు రూపాయలకొక పాకెట్ అమ్ముతున్నాడు. బ్రెడ్‌పాకెట్లుచిన్నవి పెద్దవి కూడా ఉన్నాయి.

భయంభయంగానే ఊరంతా తిరిగాడు చంద్రం. పిల్లల చేతుల్లో అవే రొట్టెలు కనిపిస్తున్నాయి. దుకాణాలల్లో బ్రెడ్ పాకెట్ల పక్కన ఆ పాకెట్లు కూడా ఉన్నాయి. ఒకరిద్దరు చంద్రం మొహం ముందే 'అవి అగ్గోవత్తున్నయి. తియ్యగున్నయి. నువ్వు బాగా పిరం అమ్ముతున్నవు' అన్నారు. ఐదుపదీ తప్ప ఎక్కువ అమ్ముడు పోలేదు ఆనాడు. మరునాడైతే మొత్తానికి కొనలేదు. ఎంత

లేటుగా వచ్చినా లూనా రొట్టెలనే కొన్నారు. అవి రెండుమూడు రోజులవరకు నిలువ ఉంటున్నాయి.

ఎల్లవ్వ మళ్లీ ఆలోచనల్లో పడింది. మందులు మానేయడంతో బీమారు మొదలయింది. చంటిపిల్ల పాలుమానినా తిండి కొరకు ఏడుస్తూనే ఉంది. ఆ ఊరి హెడ్మాస్టర్‌ను కలిసి తన బాధనంతా చెప్పుకుని ఏదైనా దారి చూపించుమంది. వినతిపత్రం రాసి జన్మభూమిలో అధికారులకు ఇవ్వమన్నాడు హెడ్మాస్టర్. అలాగే చేసి లోను కొరకు ఆఫీసుల చుట్టూ ఆశగా తిరిగాడు చంద్రం. నెలరోజులు తిప్పుకుని చేతులెత్తేసారు.

"అవ్వా! ఈ ఊర్లె మనకు బతుకుదెరువు లేదు. యాడికైనా బతుకవోదాం." బాధగా అన్నాడు చంద్రం. కొడుకుమాటలు ఎల్లవ్వ మనసును కదిలించాయి.

"యాడికిపోదాం బిడ్డా! అయ్యసుట్టాలున్నరని పోదమా.... అవ్వసుట్టాలున్నరని పోదమా... ఎవలు దిక్కున్నరనిపోదాం." అంటూ కంటతడి పెట్టుకుంది.

తను ఏమైనా ఫరవాలేదు, కొడుకు మాత్రం క్షేమంగా ఉండాలనుకుంది. వీడు ఇక్కడే ఉంటే పట్నమో బొంబాయో పారిపోతాడనుకుంది. వెంటనే హెడ్మాస్టర్‌ను కలిసి ఎస్.సి. హాస్టల్ లో చేర్పించింది. అక్కడైనా మూడు పూటలు కొడుక్కుతిండి దొరుకుతున్నందుకు తృప్తి పడింది.

వారం తిరక్కముందే హాస్టల్‌నుండి చంద్రం పారిపోయాడని ఉత్తరం వచ్చింది. 'నేను చెప్పలేదు వాడు వట్టి లంగపోరడు. అటువంటోడు పేరుకు రాడు. బాగా తిరుగమరిగిండు.' అంటూ విసుక్కున్నాడు హెడ్మాస్టర్.

వాడు లంగదొంగ కాడు సారు. బతుకుదెరువు పోరడు నా కడుపు నింపుడుకు ఆరాటపడి ఆగమయిండు ఎటు తిరుగుతుండో," ఏడుస్తూ అన్నది ఎల్లవ్వ.

'వాడు చాల్‌పోరడు, దేశమంతా బోర్లెత్తడు. బండమీద నూకలు పుట్టిత్తడు. యానంగనన్నా తేలివత్తడు.' చంద్రంను తెలిసినవారు సర్దిచెబుతున్నారు. ఇయ్యాల్ల రేపు దునియా సాపులేదు. ఎటు కాటగలిసిండోనని కొందరు భయపెట్టిస్తున్నారు.

పాత సైకిల్‌ను ఆర్తిగా తడుముతూ... కొడుకుకోసం ఆశగా, ఆవేదనగా ఎదురు చూస్తూనే ఉంది ఎల్లవ్వ ●